రేపు ఉద్యోగమేళా

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఏబీ వేడుకల మందిరంలో మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగ మేళాలో నలభైకిపైగా సంస్థలు పాల్గొంటాయన్నారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా ఐటీఐ, డిగ్రీ ఎంబీఏ, ఎంసీఏ బీటెక్, ఫార్మసీ విద్యార్హత కలిగిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నీరు పారకం సులభం...



మండలంలోని నడివాడ సమీపంలో ఓ రైతు సాగు చేసిన మిరప పంటకు నీటిని సులువుగా పారిస్తున్నారు. మిరప పంటకు నీటిని అందించడం కోసం కాలువ నుంచి ఇలా నీటిని వదిలారు. దీంతో మరో పని చేసుకునే అవకాశంతో పాటు నీరు వృథా కాదు. ఈ చిత్రాన్ని 'న్యూస్‌టుడే' తన కెమెరాలో చిత్రీకరించింది. - **న్యూస్‌టుడే, మహబూబాబాద్ రూరల్**

భద్రకాళి.. బంగారు తల్లి



స్వర్ణ కిరీటం, జుటామకుటాలు, కర్ణ పత్రాలు

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన ఓరుగల్లు శ్రీభద్రకాళి అమ్మవారు బంగారు ఆభరణాలతో దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారికి ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జుటా మకుటాలు, కర్ణ పత్రాలతో పాటు భక్తులు సమర్పించిన కానుకలు అనేకం ఉన్నాయి. పసిడి కాంతులతో దర్శనమిస్తున్న భద్రకాళి మాతను చూసి భక్తులు పులకించిపోతున్నారు.

● శ్రీదేవి శరన్నవరాత్రుల్లో రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జటా మకుటాలు, కర్ణ పత్రాలు అమ్మవారికి అలంకరిస్తారు. శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రాహ్మోత్సవాల్లో కొన్ని ఆభరణాలు అలంకరిస్తారు.


అమ్మవారి ఆభరణాలు ఇవే..

● బంగారు స్వర్ణ కిరీటం: 4 కిలోల 70 గ్రాముల 088 మిల్లీగ్రాములు ● కర్ణ పత్రము- 1 కిలో 202 గ్రాముల 004 మి.గ్రా ● కర్ణ పత్రము-1 కిలో 149 గ్రాముల 022 మి.గ్రా ● జటా మకుటం- 2 కిలో 273 గ్రాము 013 మి.గ్రా. ● జటా మకుటం 2 కిలోల 368 గ్రాముల 040 మి.గ్రా. ● తెల్లరాళ్లతో ముక్కు పోగు పెద్దది: 104 గ్రా. ● చంద్ర వంక బొట్టు: 65 గ్రా 300 మి.గ్రా. (124 చిన్న ఎరుపు రాళ్లు, 01 పెద్ద ఎరుపు రాయి) ● ఒక ఎర్ర రాళ్ల బంగారు గాజు 340 గ్రా. ● ఒక ఎరుపు రాయి ముక్కు పోగు 10 గ్రా. ● అష్టలక్ష్మి చెంబు 605 గ్రా 600 మి.గ్రా ● ఒక రాళ్ల ముక్కు పోగు 19 గ్రా 950 మి.గ్రా ● ఒక తెల్ల రాళ్ల ముక్కు పోగు 21 ముత్యాలు, ఒక ఎర్ర పూస, 13.600 మి.గ్రా ● లక్ష్మి కాసుల నెక్లెస్ 20 గ్రా. 570 మి.గ్రా ● లక్ష్మి కాసుల పేరు 21గ్రా. 300 మి.గ్రా. ●2 బంగారు గాజులు 16 గ్రా. 220 మి.గ్రా ● లక్ష్మి రూపంతో ఉన్న పచ్చల కెంపుల హారం 086- 730 మి.గ్రా ● అమ్మవారి రెండు పెద్ద పుస్తెలు, తాడు, రెండు గొట్టాలు, రాగి తీగతో కలిపి 192 గ్రా. ● పెద్ద ముక్కెర రాళ్లతో 44 గ్రా. ● అమ్మవారి పెద్ద మాంగల్య సూత్రం, తాడు, బంగారు గొట్టాలు, బంగారు గుండ్లు 130 గ్రా. ● కాసుల పేరు, రాళ్ల ముక్కు పోగు 262 గ్రా. ● ఒక ముక్కు పోగు 18గ్రా 850 మి.గ్రా.

–న్యూస్‌టుడే, రంగంపేట

బ్యాంకు లాకర్‌లోనే..: రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జుటా మకుటాలు, కర్ణ పత్రాలు, భక్తులు, దాతలు ఇచ్చిన బంగారు ఆభరణాలన్నీ హనుమకొండలోని బ్యాంకు లాకర్‌లో భద్ర పరుస్తారు. రోజు వారీగా అలంకరించే ఆభరణాలు దేవస్థానంలో ఉంటాయి.









9న మానుకోటలో నిరసన

నెల్లికుదురు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణను అమలు చేయడానికి ముందే డీఎస్సీ నియామకాలు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 9న మహబూబాబాద్ నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి డి.అనిల్‌కుమార్ కోరారు. రాజులకొత్తపల్లిలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్ర శాసనసభలో ప్రకటించి వర్గీకరణ ప్రస్తావన లేకుండా డీఎస్సీ నియామకాలు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో వివేక్, విజయ్, యాలాద్రి, సురేష్, యశ్వంత్, ఉప్పలయ్య, పాల్గొన్నారు.

7న వామపక్షాల ఆందోళన

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: గాజాలో ఇజ్రాయిల్ మారణకాండను నిరసిస్తూ అక్టోబర్ 7న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న కోరారు, ఆదివారం మహబూబాబాద్‌లో వారు మాట్లాడారు.

బతుకమ్మ పుస్తకంలో రచయిత్రి యాకమ్మ వ్యాసం



ప్రసంగిస్తున్న యాకమ్మ

మానుకోట, న్యూస్‌టుడే: అక్షరయాన్ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ 55 మంది రచయిత్రుల వ్యాసాలతో ప్రచురించిన 'ఒక్కొక్క పువ్వేసి చందమామ' పుస్తకంలో జిల్లా కేంద్రానికి చెందిన రచయిత్రి డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ రాసిన 'బతుకమ్మ పండుగ-స్త్రీల జీవన చిత్రణ' అనే వ్యాసానికి చోటు దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో వ్యాస రచయిత్రులకు చీరలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా యాకమ్మ తన ప్రసంగంలో బతుకమ్మ విశిష్టతను వివరించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి మామిడి హరికృష్ణ, అక్షరయాన్ అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, ప్రముఖ రచయితలు, కవులు పాల్గొన్నారని యాకమ్మ పేర్కొన్నారు.



మానుకోటలో బతుకమ్మలతో



మరిపెడలో..

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..!

బతుకమ్మ వేడుకలు ఆదివారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. జిల్లా కేంద్రం సహా పలు గ్రామాల్లో మహిళలు బతుకమ్మలతో సందడి చేశారు. చిన్నా పెద్దా అని తేడా లేకుండా రంగు రంగుల బతుకమ్మలు పేర్చి బతుకమ్మ పాటలతో సందడి చేశారు. పలు ఆలయాల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల చిత్రాలు ఇవి.

–నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే





జిల్లా కేంద్రంలో



మానుకోటలో ..



మరిపెడలో బతుకమ్మతో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్

90 శాతం సన్నాలే సాగు..!

ధాన్యం కొనుగోలుకు యంత్రాంగం సన్నద్ధం

ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా వానాకాలం ధాన్యం సేకరణకు అధికారయంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల సంఖ్య, లక్ష్యాన్ని ప్రకటించింది. మరో 25 రోజుల్లో వరికోతలు ప్రారంభం కానుండడంతో అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో వాటి సేకరణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలపై దృష్టిసారించారు.

–ఈనాడు, మహబూబాబాద్

'ఉమ్మడి వరంగల్‌లో ఈ వానాకాలంలో వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం 9,02,233 ఎకరాల్లో వరి సాగవుతోంది. క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో సన్నాల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. మొత్తం సాగులో 90 శాతం వరకు ఇవే ఉంటాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. దీని ప్రకారం 10 శాతమే దొడ్డు రకాల సాగైనట్లు లెక్క.'



ధాన్యం ధరలు

☛ ఏ గ్రేడ్ రకం (క్వి. రూ.): 2320

☛ సాధారణ రకం (క్వి.రూ.): 2300

జిల్లాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వివరాలు

జిల్లా	● ధాన్యం కేంద్రాల సంఖ్య	● ధాన్యం సేకరణ లక్ష్యం(టన్నుల్లో)
మహబూబాబాద్	234	2,88,000
వరంగల్	203	2,40,000
భూపాలపల్లి	189	2,00,000
జనగామ	180	2,00,000
ములుగు	173	1,50,000
హనుమకొండ	149	1,50,000

ఇదీ లెక్క..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,128 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 12.28 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని పౌరసరఫరాలశాఖ అధికారులు నిర్దేశించుకున్నారు. అత్యధికంగా మహబూబాబాద్, అత్యల్పంగా హనుమకొండ, ములుగు జిల్లాలో సేకరణ లక్ష్యం ఉంది. 12.28 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు 3.07 కోట్ల గన్నీ సంచులు అవసరం. అకాల వర్షం వస్తే నష్టం జరగకుండా టార్పాలిన్ పరదాలు అవసరం. ఇందుకు దాదాపు 35 వేల పరదాలు సిద్ధం చేసుకుంటున్నారు.

ఏఈవోలే కీలకం

ధాన్యంలో తేమశాతం, నిబంధనల ప్రకారం సన్నాల నిర్ధారణ చేసి టోకెన్లు జారీ చేయడంలో వ్యవసాయ విస్తర్ణాధికారులు(ఏఈవో) కీలకం. బోనస్ వర్తించే 33 రకాల సన్నాల గుర్తింపులో తగిన జాగ్రత్తలు పాటించాలి. సన్నధాన్యం గుర్తింపు కోసం గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రోమీటర్)ను ఉపయోగించనున్నారు. ఈ యంత్రం గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉంటేనే కొనుగోలు చేస్తారు.

ఇలా గుర్తిస్తారు..

ప్రతి గ్రామంలో సన్నాలకు, దొడ్డు రకాలకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఒకేచోట రెండూ కొనుగోలు చేస్తే తూకాలు వేర్వేరుగా చేస్తారు. సన్నాల సంచులను ఎరుపు, దొడ్డురకాలను ఆకుపచ్చ దారంతో కుడుతారు. సన్నాల బస్తాలపై 'వై' ఆకారం గుర్తును, కొనుగోలు కేంద్రం సంఖ్య ముద్ర వేయాలని అధికారులు నిర్ణయించుకుంటున్నారు.

వీటిపై దృష్టి సారించాలి

☛ కేంద్రాల వద్ద రైతుల కోసం నీడ, తాగు నీటి వసతిని కల్పించాలి.

☛ తూకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలి.

☛ కాంటా పూర్తయిన వెంటనే బస్తాలను మిల్లులకు తరలించాలి. మిల్లరు సైతం ధాన్యంలో తేడాలున్నాయని సాకులు చెబుతూ పెట్టే కోతలను నివారించాలి.

☛ ఏఈవోలు ఇచ్చిన టోకెన్ల ప్రకారం తూకాలు వేయాలి.

మెరుగైన ఫలితాల సాధన లక్ష్యం

డీఐఈఓ మదార్



మానుకోట, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో పని చేస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి (డీఐఈఓ) చింతలపాటి మదార్ తెలిపారు. ప్రతి కళాశాలలో విద్యార్థుల హాజరును పెంచేందుకు దృష్టి సారించి ఈ దిశగా కృషి చేస్తున్నామన్నారు. గత ఏడాది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో 17వ స్థానంలో నిలిచింది. ఈక్రమంలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇంటర్ విద్యాభివృద్ధి జరుగుతున్న కృషి, విద్యార్థుల సమాయత్తం తదితర విషయాలపై ఇటీవల డీఐఈఓగా బాధ్యతలు స్వీకరించిన మదార్‌తో 'న్యూస్‌టుడే' ముఖాముఖి నిర్వహించింది. వివరాలు ఆయన మాటల్లోనే...

ముఖాముఖి

ప్రవేశ పరీక్షలపై ఉచిత శిక్షణ

పేద, మధ్యతరగతి విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఈ విద్యాసంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచితంగా ఎప్‌సెట్, నీట్ తదితర ప్రవేశ పరీక్షలకు ఆయా సబ్జెక్టుల అధ్యాపకులతో ఏడో పీరియడ్‌లో శిక్షణ ఇస్తున్నాం. గతంలో ఇలాంటి శిక్షణ ఉన్నప్పటికీ జిల్లాలో ఆసక్తి ఉన్న వారితో ఏదో ఒక కళాశాలలోనే శిక్షణ నిర్వహించేది.

పెరిగిన ప్రవేశాలు

ఈ విద్యాసంవత్సరంలో మే నుంచే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 30 వరకు గడువు పెంచారు. గత ఏడాది జిల్లాలోని 10 ప్రభుత్వ కళాశాలల్లో ప్రథమ సంవత్సర ప్రవేశాలు సాధారణ, వృత్తి విద్యా కోర్సులను కలుపుకుని 1,112 ఉండగా ఈసారి ఇప్పటివరకు 1,308 మంది విద్యార్థులు చేరారు. వీరికి జూన్ ఒకటి నుంచే తరగతులు ప్రారంభమయ్యాయి. ద్వితీయ సంవత్సర విద్యార్థులు 1,068 మంది ఉన్నారు.

జనవరిలో పునశ్చరణ తరగతులు

విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశాం. ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పాఠ్యాంశాల సిలబస్ సకాలంలోనే డిసెంబర్‌లో పూర్తి చేస్తాం. ఆ తర్వాత జనవరి నుంచి పునశ్చరణ తరగతులు ఉంటాయి. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత లేదు. అంతేగాక టీఎస్‌పీఎస్సీ నియామకాల ద్వారా భవిష్యత్‌లో కొందరు అధ్యాపకులు వచ్చే అవకాశం ఉంది.

యువజన పర్యాటక క్లబ్‌ల ఏర్పాటు

కేంద్ర పర్యాటక శాఖ సూచనల ప్రకారం ప్రతి కళాశాలలో యువజన పర్యాటక క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి 25 మంది విద్యార్థులకు ఒక సమన్వయకర్త ఉంటారు. ఈ క్లబ్‌ల ద్వారా చారిత్రక ప్రదేశాల సందర్శన, వివిధ ప్రాంతాల్లోని సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు.

ప్రత్యేక అధ్యయన తరగతులు..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక అధ్యయన తరగతులను నిర్వహిస్తున్నాం. ఈ తరగతుల నిర్వహణ గురించి ఎప్పటికప్పుడూ కళాశాలలను సందర్శించి పర్యవేక్షణ చేస్తున్నాం. కళాశాలల్లో నిర్వహించాల్సిన విద్యావిషయక అంశాల గురించి ప్రధానాచార్యులతో జూమ్ వేదికగా సలహాలు ఇస్తున్నాం.

నవంబర్‌లో అర్ధ వార్షిక పరీక్షలు

ఏటా 4 యూనిట్ పరీక్షలు జరుగుతాయి. ఇప్పటికి రెండు జరిగాయి. దసరా సెలవుల తర్వాత నవంబర్‌లో అర్ధవార్షిక పరీక్షలను నిర్వహిస్తాం. ఆయా పరీక్షల్లో విద్యార్థుల ఫలితాలను సమీక్షిస్తూ మరింతగా సూచనలు చేస్తాం.

ఇళ్ల కూల్చివేతతో ఇబ్బందులు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: పట్టణంలోని నెహ్రూసెంటర్ నుంచి పత్తిపాక, రజాలిపేట వరకు రహదారి విస్తరణ పనుల పేరిట ఇళ్లను కూల్చివేసి రహదారుల నిర్మాణం చేయకుండా ఆయా ప్రాంతవాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి ఆరోపించారు. ఆదివారం సీపీఎం పత్తిపాక శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు, మూడేళ్ల నుంచి రహదారి పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం అనేక మందిని వీధుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనల మేరకు ఇళ్లను తొలగించి రహదారి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. మల్లమ్మ, కె.నాగన్న, హేమానాయక్, వెంకన్న, లాలయ్య, శ్రీనివాసు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం..!



శిలాఫలకాన్ని ధ్వంసం చేస్తున్న మహిళలు

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరులో నిర్మిస్తున్న ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలకు కేటాయించిన భూములను కోల్పోతున్న రైతులు తమ ఆవేదనను అర్థం చేసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం బాధిత రైతుకుటుంబాలకు చెందిన కొందరు పాఠశాల శిలాఫలకాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. పురుగు మందు డబ్బా పట్టుకొని బాధిత రైతుకుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ నాలుగేళ్లుగా తమ భూముల కోసం న్యాయంగా పోరాడుతున్నామన్నారు. పాఠశాలకు కేటాయించిన భూముల్లో పనులను చేపట్టకూడదంటూ అధికారులకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయినప్పటికీ సరిగా స్పందించడం లేదన్నారు. తమ భూములను ఇప్పించాలని, వెంటనే ఆ ప్రాంతంలో నిల్వ చేసిన సామగ్రి తొలగించాలన్నారు. భూక్య నాగమని, భూక్య కమల, భూక్య ఆశ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై తహసీల్దారు శ్వేతను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. కోర్టు ఉత్తర్వుల ప్రకారం వివరాల కోసం బాధిత రైతుల కుటుంబాలకు నోటీసులిచ్చామన్నారు. తదుపరి చర్యలు ఏవైనా కోర్టు ఉత్తర్వుల ప్రకారమే తీసుకోనున్నట్లు తెలిపారు.

పండగ వేళ.. ట్రాఫిక్ పద్మవ్యూహం

● సిబ్బంది లేక ఇబ్బందులు



కాజీపేట బ్రిడ్జి వద్ద వాహనాల రద్దీ.. ఇక్కడ రైల్వే వంతెన ఒకటే ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. అసంపూర్తిగా ఉన్న మరో రైల్వే వంతెన పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాలు, దసరా పండగను పురస్కరించుకొని వరంగల్ నగరంలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగింది. పండగ సామగ్రి, దుస్తుల కొనుగోళ్లకు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి తరలివస్తున్న ప్రజలతో మార్కెట్ రోడ్లన్నీ కిక్కిరిసి పోతున్నాయి. కాజీపేట నుంచి వరంగల్, కరీంనగర్ రహదారిలో వాహనాల సంఖ్య అధికంగా ఉంటోంది. దీంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. పండగ రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు, నగరవాసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

● ప్రతినెలా 4 వేల వరకు కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి.

ఇదీ పరిష్కారం..

- రోడ్లు ఇరుకుగా ఉండి జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వన్‌వేలను ఏర్పాటు చేయాలి.
- సిగ్నల్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్ ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- ఉదయం, సాయంత్రం కళాశాలలు, పాఠశాలల సమయంలో అదనంగా సిబ్బందిని నియమించి ట్రాఫిక్‌ను నియంత్రించాలి.
- రద్దీని బట్టి ట్రాఫిక్ కూడళ్ల వద్ద అదనంగా సిబ్బందిని కేటాయించాలి.

రోడ్లపై 2 లక్షలకు పైగా వాహనాలు..

● పోలీసు శాఖ లెక్కల ప్రకారం కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో రెండు, నాలుగు చక్రాలు, భారీ వాహనాలు కలిపి సుమారు 4.50 లక్షల వరకు ఉంటాయి. ప్రతి రోజు ఇతర ప్రాంతాల నుంచి లక్ష వరకు వాహనాలు నగరానికి వచ్చి వెళ్తుంటాయి. అన్ని కలిపి నగరంలో రోజుకు 2 లక్షలకు పైగా వాహనాలు తిరుగుతుంటాయని పోలీసుల అంచనా. పండగల వేళ మరో 20 వేలు అధికంగా తిరుగుతుంటాయి.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై చలాన్లు ఇలా..

నగరంలో మూడు ట్రాఫిక్ ఠాణా పరిధిలో ఈఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు విధించిన ట్రాఫిక్ చలాన్లు కేసుల నమోదు

ఉల్లంఘనలు	కేసుల సంఖ్య	జరిమానా (రూ.లలో)
హెల్మెట్ లేకుండా చలాన్లు	2,56,767	4,24,71,300
రాంగ్ రూట్ డ్రైవింగ్	11,531	22,92,400
ట్రిపుల్ రైడింగ్	10,261	1,19,91,600
చరవాణి మాట్లాడుతూ డ్రైవింగ్	6004	59,58,000



తిరుమల జంక్షన్‌లో..

ఇదీ పరిస్థితి..

పెరిగిన ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రస్తుతం నగరంలోని మూడు ట్రాఫిక్ ఠాణాల్లోని సిబ్బంది సరిపోవడం లేదు. ఏఆర్ విభాగం నుంచి కొందరిని కేటాయించారు. అయినప్పటికీ కాజీపేట ఫాతిమా నగర్ బ్రిడ్జి, పెట్రోల్‌పంపు, లష్కర్‌బజార్, హనుమకొండ చౌరస్తా, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డు, నయీంనగర్, వరంగల్ పోచమ్మ మైదానం, వరంగల్ చౌరస్తా, హెడ్ పోస్టాఫీస్, ఎస్‌వీఎన్ రోడ్డు ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ జామ్ కావడంతో పాటుగా రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

● పదేళ్లలో నగరంలో వాహనాల సంఖ్య వంద శాతం పెరిగింది. ఆ స్థాయిలో రహదారుల విస్తరణ జరగలేదు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటుంది. పండగల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం సిబ్బందిని పెంచాలి.



వరంగల్ చౌరాస్తా నుంచి బట్టల బజార్ రోడ్డు..



వరంగల్ చౌరాస్తాలో అన్ని వైపులకు ఒకరే ట్రాఫిక్ పోలీసు..

సిబ్బంది సంఖ్య పెరగాలి..

ప్రస్తుతం వరంగల్ కమిషనరేట్ పరిధిలో 14 నుంచి 16 కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. ఇన్ని కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలంటే సుమారు 400లకు పైగా సిబ్బంది అవసరం.

● ప్రస్తుతం 140 మంది ట్రాఫిక్ సిబ్బంది, 100 మంది హోంగార్డులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కంటే ట్రాఫిక్ నియంత్రణ పాయింట్లు పెరిగాయి. నగర శివారులతో కలిపి మొత్తం 51 ట్రాఫిక్ పాయింట్లు, 11 సిగ్నల్స్ ఉన్నాయి.

● నగరంలో మూడు ట్రాఫిక్ ఠాణాలు మాత్రమే ఉన్నాయి. మరో మూడు అవసరం ఉంది.

పార్కింగ్‌తో సమస్య..

నగరంలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వచ్చాయి. వీటిలో షాపింగ్ చేసేందుకు వచ్చే ప్రజలు వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నారు.

ఇలా చేద్దాం: షాపింగ్ మాల్స్ ఆవరణలోని సెల్లార్లల్లో వాహనాలను పార్కింగ్ చేయాలి.

● వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి. రాంగ్ రూట్‌లో రావడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీని వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. సిగ్నల్స్‌ను పట్టించుకోకుండా ముందుకు వెళ్లడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

● వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ఇబ్బందులు ఉండవని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు.

మహాలక్ష్మీ.. కరుణించు తల్లీ!



రంగంపేట, న్యూస్‌టుడే: సిరి సంపదలివ్వమ్మా శ్రీమహాలక్ష్మీ అంటూ భక్తులు వేడుకున్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం భద్రకాళి అమ్మవారు మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యాహ్నికం, సాయంత్రం గిరిజా దుర్గార్చన పూజారాధనలు జరిపారు. ఉదయం 11 గంటలకు సూర్యప్రభ వాహనం, సాయంత్రం హంస వాహన సేవలు నిర్వహించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అందరూ ముఖ్యులే.. సాధారణ భక్తులకు అవస్థలు!



అమ్మవారి దర్శనానికి వరుసలో ఉన్న సాధారణ భక్తులు



వీఐపీ ద్వారం వద్ద రద్దీ

రంగంపేట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భక్తులు భద్రకాళి ఆలయానికి పోటెత్తుతున్నారు. రద్దీకి అనుగుణంగా దేవస్థానం అధికారులు, ఉద్యోగులు తగిన ఏర్పాట్లు చేయడం లేదు. ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాదాపు 2-3 గంటల పాటు అన్ని క్యూలైన్లలో సాధారణ భక్తులు బారులుతీరారు. వీళ్లను అలాగే వదిలేసి వీఐపీ(అత్యంత ముఖ్యమైన వ్యక్తి) ద్వారంలో నుంచి వందలాది మందిని ఒకేసారి లోనికి పంపించడంతో గందరగోళం నెలకొంది. కొందరు ప్రైవేటు వ్యక్తులు, అర్చకులు బంధువులు, స్నేహితులను వీఐపీ మార్గం గుండా తీసుకెళ్లారు. గంటల తరబడి సాధారణ భక్తులు క్యూలైన్లలో విలవిల్లాడారు. తాగునీటి కోసం అల్లాడారు. రద్దీని కట్టడి చేసేందుకు వెళ్లిన ఈవో శేషుభారతి సైతం అందులో ఇరుక్కుపోయారు. సాధారణ భక్తులను వదిలేసి వీఐపీ మార్గానికే ప్రాధాన్యం ఇచ్చారని భక్తులు నిలదీశారు.

ప్రైవేటు పెత్తనం..: భద్రకాళి ఆలయంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల పేరుతో పలువురు.. మాజీ ధర్మకర్తలు, దాతల పేరుతో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారు. వీఐపీ క్యూలైన్ వద్ద వారిదే హవా నడుస్తోంది. కొందరు అర్చకులు సైతం అతిగా వ్యవహరిస్తున్నారు. అడ్డదారిలో భక్తులను గర్భాలయంలోకి తీసుకెళ్తున్నారు.

తెల్లబంగారం.. అన్నింటికీ ఆధారం

నేడు ప్రపంచ పత్తి దినోత్సవం

ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా రైతులు పండించే ప్రధాన పంట పత్తి.. ఇది వారికి ముఖ్యమైన ఆదాయ వనరు. సోమవారం ప్రపంచ పత్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పంట ప్రధాన్యం, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 5,13,289 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా.. 4,10,632 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



పత్తి ప్రాధాన్యం.. ప్రాముఖ్యాన్ని గుర్తించడంతో పాటు పత్తిపై అవగాహన పెంచేందుకు, సాగును ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏటా అక్టోబరు 7న ప్రపంచ పత్తి దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాది పత్తి దినోత్సవం ఉద్దేశం 'కాటన్ ఫర్ గుడ్'. దీనిని ప్రపంచ వాణిజ్య సంస్థ, యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ సంయుక్తంగా నిర్ణయించారు.

మీకు తెలుసా..

- ప్రపంచ దేశాలతో పోలిస్తే మనదేశం 40 శాతం తెల్లబంగారాన్ని పండిస్తోంది.
- ప్రపంచ వ్యాప్తంగా పత్తిని వాణిజ్య పంటగానే కాకుండా ఆహార, చమురు పంటగా గుర్తిస్తున్నారు. పత్తి గింజలను వంట నూనెగా, గింజల చెక్కను పశు దాణాగా వాడుతున్నారు. కొన్ని దేశాల్లో గింజల నూనెను జీవ ఇంధనం తయారీకి వినియోగిస్తున్నారు.
- పత్తి తన సొంత బరువు కన్నా 27 రెట్లు నీటిని గ్రహించగలదు. దాంతో కావాల్సిన సాంద్రతతో వస్త్రాలను నేయవచ్చు. నాణ్యత కాటన్ ఫ్యాబ్రిక్‌కు సులభంగా రంగులు వేసేందుకు వీలుగా ఉంటుంది.
- ఓ జీన్స్ తయారీకి 0.68 కిలోలు, చొక్కాకు 0.28 కిలోలు, టీషర్టుకి 0.23 కిలోలు, డైపర్ తయారీకి 0.07 కిలోలు, టవల్‌కు 0.28 కిలోలు పత్తి అవసరమని అంచనా.

ఏడాది పొడవునా ఉపాధి..

అంతర్జాతీయ పత్తి సలహా కమిటీ(ఐసీఏసీ) అంచనా ప్రకారం.. రైతు పండించిన ఓ టన్ను పత్తి అయిదుగురికి ఏడాది పొడవునా ఉపాధి కల్పిస్తోంది. వైద్య రంగం, పశుగ్రాసం, వంటనూనె పరిశ్రమలతో పాటు వస్త్ర పరిశ్రమలకు ఇది ముడి సరకు. వ్యవసాయం, తయారీ, రిటైల్ రంగాల్లో ఉద్యోగాలను సృష్టిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ప్రత్యక్షంగా 10 వేల మందికి, పరోక్షంగా 20 వేల మందికి పైగా పత్తి పరిశ్రమ ఉపాధి కల్పిస్తుంది. రైతులు, కూలీలతో పాటు వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, ఫిట్టర్లు, ప్రెస్సింగ్, జిన్నింగ్ ఆపరేటర్లు, హమాలీలు, మార్కెటింగ్‌శాఖ, వస్త్ర పరిశ్రమ, తదితర అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న వారికి ఉపాధి లభిస్తోంది.

● ఉమ్మడి జిల్లాలో మొత్తం 55 జిన్నింగ్ మిల్లులుండగా.. ఒక్కో మిల్లులో సుమారు 150 మంది పనిచేస్తూ.. తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.



హనుమకొండ జిల్లా ఆత్మకూరులో పత్తి తీస్తున్న మహిళా కూలీ (పాతచిత్రం)

రంగురంగుల్లో.. పంట

పత్తి అనగానే మనకు తెల్లని దూది మాత్రమే స్ఫురిస్తుంది. ఆ దూదిని రంగురంగుల్లో పండించేందుకు పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు. నాగపూర్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రిసెర్చ్ సంస్థ, దార్వాడలోని అగ్రికల్చరల్ సైన్సెస్ యూనివర్సిటీలకు చెందిన నిపుణులు రంగుల పత్తి వంగడాలను సృష్టించి, ఏడేళ్లుగా వివిధ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా పండిస్తున్నారు. సహజసిద్ధంగా పత్తికి రంగు రావడంతో.. అదనంగా పత్తి దారాలకు రంగు నీళ్లలో ముంచాల్సిన అవసరం ఉండదు. దాంతో జల కాలుష్యాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.



వివిధ ప్రాంతాలకు ఎగుమతి..

ఉమ్మడి వరంగల్‌లో పండిన పత్తిని వ్యాపారులు వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి నుంచి స్పిన్నింగ్ చేసిన దూది బేళ్లు ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, వియత్నాం, చైనా దేశాలకు ఎగుమతి అవుతుంది. పత్తి నుంచి వేరుచేసిన గింజలను వంట నూనె, పశువుల దాణా తయారీ కోసం హరియాణా, పంజాబ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తుంటారు.

పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- బొమ్మినేని రవీందర్‌రెడ్డి, పత్తి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రంలో పత్తి ఆధారిత, అనుబంధ పరిశ్రమలు లేకపోవడంతో ఇక్కడ పండిన దిగుబడులు ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుతో ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు రవాణా భారం తగ్గుతుంది. యూరియా సంచుల్లో రైతులు పత్తిని తీసుకురావడం వల్ల తెల్లని ప్లాస్టిక్ వ్యర్థాలు పత్తిలో కలిసిపోతున్నాయి. స్పిన్నింగ్ మిల్లులు అలాంటి పత్తిని తిరస్కరిస్తున్నాయి. ప్రభుత్వం యూరియా బస్తాల రంగును మార్చడం ద్వారా ఈ సమస్య పరిష్కరించవచ్చు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది వివరాలు

జిల్లా	పత్తి సాగు (ఎకరాల్లో)	దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)
వరంగల్	1,20,037	96,030
హనుమకొండ	77,330	61,864
జనగామ	1,25,195	1,00,156
ములుగు	21,114	16,891
భూపాలపల్లి	91,281	73,025
మహబూబాబాద్	78,332	62,666




సాధించిన పతకంతో సుకన్య

పవర్ లిఫ్టింగ్‌లో రజత పతకం

సీరోలు(కురవి), న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం రేకుల తండా గ్రామపంచాయతీ శివారు జగ్యాతండాకు చెందిన తేజావత్ సుకన్య కామన్‌వెల్త్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ పోటీల్లో రజత పతకం సాధించారు. మారుమూల గిరిజన తండాలోని మధ్య తరగతి గిరిజన కుటుంబంలో జన్మించిన ఆమె క్రీడల్లో రాణించాలనే తపనతో ముందుకు సాగుతున్నారు. డిగ్రీ వరకు చదువుకున్న ఆమె తొలుతగా వెయిట్ లిఫ్టింగ్‌తో ప్రారంభించి అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు పొందారు. 2024 జూన్‌లో దక్షిణ ఆఫ్రికా దేశంలో పవర్‌లిఫ్టింగ్‌లో రాణించి పతకం సాధించారు. ఈనెల 4 నుంచి దక్షిణాఫ్రికా దేశంలోని సన్‌సిటీలో జరుగుతున్న పోటీల్లో శనివారం రాత్రి జరిగిన బాలికల విభాగం పవర్‌లిఫ్టింగ్‌లో 76 కిలోల బరువు ఎత్తి రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నారు. తండ్రి లక్ష్మణ్ ఇల్లందులో సింగరేణి ఉద్యోగం చేస్తున్న క్రమంలో తల్లిదండ్రులతో కలిసి రోజు ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు. అక్కడ కొంత మంది వెయిట్‌లిఫ్టింగ్ సాధన చేస్తుండగా వారితోపాటు సుకన్య చేసేవారు. ఆసక్తి పెరగడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లి శిక్షణ పొంది జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో బంగారు, వెండి పతకాలు సాధించారు. దక్షిణ ఆఫ్రికాకు వెళ్లేందుకు సహకరించిన గ్రీన్‌కో సంస్థ గ్రూపు ఛైర్మన్ అనీల్‌కుమార్‌శెట్టికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పిడుగుపాటుతో ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఆర్.సింగారం రఘు

నెల్లికుదురు, న్యూస్‌టుడే: పిడుగుపడి ప్రైవేటు కంపెనీలోని ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని నర్సింహులగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగ్‌పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి వరకు గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. నిర్మాణ సామగ్రి సంబంధిత ఉద్యోగులు, సిబ్బంది నివాసం కోసం ఆలేరు, నర్సింహులగూడెం గ్రామాల పరిధిలో క్యాంప్ ఏర్పాటు చేశారు. తమిళనాడు రాష్ట్రం వెళ్లూరు జిల్లా తిరుపత్తూరు, పెరియార్‌కొట్టం ప్రాంతానికి చెందిన ఇంజినీరు ఆర్. సింగారం రఘు మూడు నెలల నుంచి పనిచేస్తున్నారు. ఆదివారం క్యాంప్ కార్యాలయం ఆరుబయట చరవాణిలో మాట్లాడుతున్నారు. అకస్మాత్తుగా పిడుగు పడటంతో ఆయన తీవ్రంగా గాయపడగా అక్కడ ఉన్న వారు సీపీఆర్ చేసి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

నేడు, రేపు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: 10వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర, హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలు, 10 క్రీడా పాఠశాలల నుంచి అథ్లెట్లు హాజరవుతారన్నారు. ముఖ్య అతిథిగా పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి, ఇతర జాతీయస్థాయి అథ్లెట్లు, ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రను రికార్డు చేయాలి



సదస్సులో ప్రసంగిస్తున్న కోదండరాం, వేదికపై అంబటి శ్రీనివాస్, కేయూ ప్రొఫెసర్ వెంకటనారాయణ తదితరులు

నర్సంపేట, న్యూస్‌టుడే: భావితరాలకు తెలిసేలా తెలంగాణ ఉద్యమాన్ని రికార్డు చేయాలని ఎమ్మెల్సీ, తెజస వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాం ప్రభుత్వాన్ని కోరారు. ఈ చరిత్రను మరుగున పడేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తెలంగాణ ఐకాస నర్సంపేట డివిజన్ కమిటీ, తెజస ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేటలో వేడుకల మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి తెలంగాణ ఉద్యమకారుల సదస్సులో కోదండరాం మాట్లాడారు. స్వయంపాలన కోసం అరవై ఏళ్లుగా ఎన్నో సంఘాలు, ఎందరో చేసిన పోరాటం, 1200 మంది ప్రాణత్యాగాలతో ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా నిర్బంధాలు, ఫోన్‌ట్యాపింగ్, అక్రమ అరెస్టులు లేవని, ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణానికి పాటుపడదామన్నారు. అమరుల కుటుంబాలకు పింఛన్లు, ఇళ్ల స్థలాలు, గుర్తింపు కార్డులిచ్చి వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద కోదండరాంకు స్థానికులు స్వాగతం పలికారు. అమరవీరుల స్తూపం, చాకలి ఐలమ్మ, అంబేడ్కర్, వడ్డెర జాతి నాయకుడు ఓబలన్న విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెజస రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు నెలల్లో తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించకపోతే మరో ఉద్యమం తప్పదన్నారు. కేయూ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రసంగిస్తూ గత పదేళ్లలో తెలంగాణ వనరులను దోపిడీ చేసిన దొంగలు పది నెలల్లో ఏదో జరిగినట్లు రచ్చ చేస్తున్నారన్నారు. ఈ సర్కార్‌ను కాపాడుకోవాలన్నారు. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సదస్సులో నిట్ ప్రొఫెసర్ రమ, ఉద్యమకారులు, ప్రజా సంఘాల, ఐకాస నాయకులు రామ్మూర్తి, జావిద్, అరుణ, ఖాలీ సయ్యద్, అరుణ, డాక్టర్ జగదీశ్వర్, రమాదేవి పాల్గొన్నారు. వివిధ సంఘాల నాయకులు కోదండరాంకు వినతి పత్రాలు సమర్పించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

జయమ్మకు ప్రభుత్వ విప్ నివాళి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్‌లో ఆదివారం ఉదయం మృతి చెందిన కురవికి చెందిన సీనియర్ రాజకీయ నేత వద్దుల సురేందర్‌రెడ్డి తల్లి జయమ్మకు రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, డోర్నకల్ మాజీ శాసనసభ్యుడు డీఎస్ రెడ్యానాయక్, జడ్పీటీసీ మాజీ సభ్యులు అంబటి వీరభద్రం, బండి వెంకట్‌రెడ్డి, ఓడీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ నూకల వేణుగోపాల్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌ఛైర్మన్ బజ్జూరి పిచ్చిరెడ్డి, కురవి దేవాలయం మాజీ ఛైర్మన్ మేక దామోదర్‌రెడ్డి, బాదావత్ రాజునాయక్, రాజేందర్‌రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు మృతురాలికి నివాళులు అర్పించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఇనుగుర్తి, న్యూస్‌టుడే: చిన్నముప్పారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మల్లం యాకయ్య ఇటీవల మృతిచెందగా వారి కుటుంబానికి ఆదివారం భారాస గ్రామ పార్టీ అధ్యక్షులు నామాల మహేష్ ఆధ్వర్యంలో రూ.9వేలు ఆర్థిక సహాయం అందించారు. రమేష్‌తో కలిసి పదోతరగతి చదువుకున్న విద్యార్థులు వారి కుటుంబానికి రూ.6వేల సహాయం అందించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గుండా వెంకన్న, నాయకులున్నారు.



కురవిలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



గార్ల వేంకటేశ్వరస్వామి ఆలయంలో...



కురవిలో..

ఘనంగా బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ సంబరాలు పలు గ్రామాల్లో వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారంతో అయిదో రోజుకు చేరుకున్నాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు ఆడిపాడారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. మానుకోటలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి మహిళలకు బహుమతులు ఇచ్చారు.

– న్యూస్‌టుడే బృందం



దంతాలపల్లిలో ..



మానుకోటలో బతుకమ్మ ఆడుతున్న సీపీఐ నేత అజయ్‌సారథిరెడ్డి



మరిపెడలో నిమజ్జనం చేస్తున్న పురపాలిక సిబ్బంది



ముంగిముడుగులో



కన్యకాపరమేశ్వరీ ఆలయంలో...

రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్

బయ్యారం, న్యూస్‌టుడే: రైతును రాజును చేస్తామంటూ ప్రకటిస్తున్న పాలక ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్, రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపేటలో సంఘం జిల్లా జనరల్‌కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక అప్పులపాలవుతున్నారని పేర్కొన్నారు. ఖరీఫ్ సంబంధించిన రైతు భరోసాను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు అందజేయలేదన్నారు. రైతు రుణమాఫీని సైతం పూర్తిగా అమలు చేయడంలేదన్నారు. మదార్, సరళ, బాబు, రామచంద్రు, జీవన్, కోటయ్య, వెంకన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలు సాధించాలి

మానుకోట, న్యూస్‌టుడే: జాతీయోద్యమ అమరవీరుల ఆశయాలను సాధించేందుకు యువత కృషి చేయాలని జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు నూకల లింగారెడ్డి కోరారు. ప్రతినెల మొదటి ఆదివారం అమరవీరులకు నివాళులర్పించే కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో మహాత్మాగాంధీ విగ్రహానికి స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘ రాష్ట్ర ప్రతినిధి సింగు రమేశ్, చిలుకపల్లి ముత్తిలింగం, శివనాధుల సుభద్రాదేవి తదితరులున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే మురళీనాయక్ జన్మదిన వేడుకలు



మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేకు కోస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబాబాద్, కేసముద్రం, గూడూరు, ఇనుగుర్తి, నెల్లికుదురు, న్యూస్‌టుడే: మహబూబాబాద్ శాసనసభ్యుడు డాక్టర్ భూక్యా మురళీనాయక్ జన్మదిన వేడుకలు ఆదివారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చంద్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కేక్ కోశారు. పార్టీ నాయకులు, వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, పార్టీల నాయకులు, వ్యాపారులు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రక్తదాన శిబిరంలో రెడ్‌క్రాస్ అసోసియేషన్ ప్రతినిధులు పీవీ.ప్రసాద్, వెంకటరెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. నెల్లికుదురు, కేసముద్రం, కోరుకొండపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేసముద్రంలో పంచాయతీ మహిళా సిబ్బంది, ఆశాకార్యకర్తలకు చీరలు పంపిణీ చేశారు. గూడూరులో ఎమ్మెల్యేతో కలిసి నాయకులు, కార్యకర్తలు కేక్ కోశారు. అటవీశాఖ కార్యాలయం వద్ద నుంచి కూడలి వరకు ర్యాలీగా తీసుకువచ్చారు. ఇనుగుర్తిలో మండల పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు.

వేర్వేరుగా..

కేసముద్రంలో నాయకులు, కార్యకర్తలు రెండు వర్గాలుగా వేడుకలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడి నియామకం, మార్కెట్ ఛైర్మన్ నియామకంలో ఏర్పడిన విభేదాల కారణంగా మండల కేంద్రంలో పార్టీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒక వర్గం మండల కేంద్రంలోని అంబేడ్కరు సెంటరులో, మరో వర్గం పొట్టి శ్రీరాములు కూడలిలో వేడుకలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మురళీనాయక్ అంబేడ్కరు కూడలిలో వేడుకల్లో పాల్గొన్నారు. అక్కడి నుంచి పొట్టిశ్రీరాములు కూడలిలో మండల పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొనకుండానే వెళ్లడంతో పార్టీ శ్రేణులు నిరాశ చెందారు. మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఎమ్మెల్యేకు గూడూరులో అత్యవసరంగా పని ఉండటంతో వెళ్లారని తెలిపి కేకు కోశారు. ఇనుగుర్తిలో వేడుకలు జరుగుతుండగా ఓ గ్రామానికి చెందిన నాయకుల మధ్య వర్గ పోరు బహిర్గతమైంది. గ్రామ పార్టీ అధ్యక్షుడు లేకుండా వేడుకలు నిర్వహించారని నాయకులు వాగ్వాదానికి దిగారు. కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజు జోక్యం చేసుకొని నచ్చజెప్పడంతో సమస్య సద్దుమణిగింది.




పడమటిగూడెంలో



తొర్రూరులో..



పాతశివాలయం సమీపంలో..



గార్లలో

శక్తి స్వరూపిణి నమోస్తుతే!

ఊరు వాడా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వివిధ రూపాల్లో అమ్మవారిని దర్శించుకొని భక్తులు తరించారు. శక్తి స్వరూపిణి దుర్గామాతను కీర్తించారు. డోర్నకల్ జైన్ భవన్‌లో దుర్గమ్మ ఆదివారం మహాచండి అవతారంలో దర్శనమిచ్చారు. బయ్యారంలో దుర్గామాత శ్రీలలితత్రిపుర సుందరీదేవి అవతారంలో ఆదివారం భక్తుల పూజలందుకున్నారు. గాంధీసెంటర్‌లో మహిళలు జలబిందెలతో తరలివెళ్లి గ్రామంలోని ముత్యాలమ్మకు, నాభిశిలకు అభిషేకం చేశారు. గార్లలో దుర్గాదేవిని లలితా త్రిపుర సుందరీదేవి అవతారంగా అలంకరించారు. భవానీ దీక్షాపరులు ప్రత్యేక పూజలు చేశారు.

– న్యూస్‌టుడే, బృందం:



పెద్దముప్పారంలో శ్రీవారాహిదేవి అవతారంలో...



గూడూరులో



కేసముద్రంలో శాకాంబరి అలంకరణలో

బండిమీద బండి... ప్రమాదమేనండి



ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే ఆబ్కారీ శాఖకు ఆదరణ కరవైంది. డివిజన్ కేంద్రంలోని కంఠాయపాలెం క్రాస్ రోడ్డు వద్ద 30 సంవత్సరాల నుంచి కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. కార్యాలయానికి స్థలం లేక ఇబ్బందులు తప్పడం లేదు. వివిధ కేసుల్లో పట్టుపడిన వాహనాలను పార్కింగ్‌కు తగిన స్థలం లేకపోవడంతో ఇలా కార్యాలయం ఎదుట రోడ్డుపై బండిపైన బండిని ప్రమాదకరంగా ఉంచారు. దీంతో అటుగా వెళ్తున్న వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. బండిమీద బండి జారిపడితే ప్రమాదమేనని వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, తొర్రూరు

సంక్షిప్తంగా

చర్యలు తీసుకోవాలి

కురవి, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీ కార్యదర్శిని ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు కోరారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కురవిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కురవి మండలం తట్టుపల్లి పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మిని ఇబ్బందులు పెట్టడంతో ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. మహబూబాబాద్ ఆసుపత్రిలో ఉన్న ఆమెను పరామర్శించారు. నిరసన తెలిపిన వారిలో నాయకులు కిషన్‌నాయక్, వీరన్న, వెంకన్న, లక్ష్మయ్య, రజినీకాంత్, అనీల్‌కుమార్, రవి ఉన్నారు.

కాళోజీ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: ప్రజాకవి రచయిత కాళోజీ స్ఫూర్తితో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తోందని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ, ముఖ్య సలహాదారులు మైస నాగయ్య అన్నారు, ఆదివారం జిల్లా కేంద్రంలో అసోసియేషన్ వార్షిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్య సలహాదారులు మైస శ్రీనివాస్, విష్ణువర్ధన్, పెద్ది వెంకన్న, మధుసూదన్‌రెడ్డి, శ్యాంరావు, సతీష్‌రెడ్డి, వెంకన్న, ఉపేందర్, ప్రభాకర్, సదానందం, శ్రీనివాస్‌రెడ్డి, వీరన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బయ్యారం, న్యూస్‌టుడే: కష్టాల్లో ఉన్న తమ మిత్రురాలు కుటుంబానికి బయ్యారం జడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి 1985-86 పూర్వవిద్యార్థులు ఆదివారం ఆర్థిక సాయం అందించి చేయూతనిచ్చారు. మండలకేంద్రానికి చెందిన జి.వెంకటలక్ష్మి భర్త వెంకన్న ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమ మిత్రురాలు వెంకటలక్ష్మికి పూర్వవిద్యార్థులు రూ.65వేలు సాయం అందజేశారు. శివరాం, దామోదర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, గిరిబాబు, సుభారాణి, ఉష, ఉమ పాల్గొన్నారు.

గీతకార్మికుల సమస్యలు పరిష్కరించండి

తొర్రూరు, న్యూస్‌టుడే: గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని గోపా జిల్లాధ్యక్షుడు కుర్ర శ్రీనివాసగౌడ్, కౌండిన్య సహకార పరపతి సంఘం గౌరవాధ్యక్షుడు ఐలయ్యగౌడ్‌లు తెలిపారు. సహకార సంఘం వార్షిక సమావేశాన్ని ఆదివారం అశోక్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. గౌడలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన గౌడ విద్యార్థులను, ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో మహేశ్‌కుమార్‌గౌడ్, వెంకటేశ్వర్లుగౌడ్, శేఖర్‌గౌడ్, కుమారస్వామిగౌడ్, రవిగౌడ్, వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా సేవలు అందించడమే లక్ష్యం

పెద్దవంగర, న్యూస్‌టుడే: నిస్వార్థంగా సేవలు అందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని లయన్స్‌క్లబ్ ఉమ్మడి జిల్లా మాజీ గవర్నర్ రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో లయన్స్‌క్లబ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఏదునూరి శ్రీనివాస్, కార్యదర్శి ఏదునూరి రేణుక, కోశాధికారిగా రాపోలు శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన వారికి అధ్యక్షుడు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో క్లబ్ నేతలు లక్ష్మీనరసింహారావు, సతీష్, లక్ష్మీనారాయణ, సోమన్న, వెంకన్న పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు అండగా సీపీఎం



జెండావిష్కరణలో సీపీఎం, హమాలీ నాయకులు

గార్ల, న్యూస్‌టుడే: అసంఘటిత కార్మికులకు సీపీఎం అండగా ఉంటుందని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. స్థానిక వర్తకసంఘం భవనంలో ఆదివారం హమాలీశాఖల మహాసభ జరిగింది. తొలుత అంబటి వీరస్వామి ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. హమాలీ రేట్ల పెంపుదలకు సీపీఎం పోరాటాలు చేస్తోందన్నారు. మండల నాయకులు కె.శ్రీనివాస్, కవిత, హరినాయక్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, మహేశ్వరరావు, వీరభద్రం తదితరులు ఉన్నారు.

పోలీస్, ప్రెస్‌క్లబ్ క్రికెట్ పోటీలు



బయ్యారం ప్రెస్‌క్లబ్ జట్టుకు కప్ అందజేస్తున్న సీఐ రవికుమార్

గార్ల, న్యూస్‌టుడే: మర్రిగూడెంలోని వేంకటేశ్వర క్రీడా మైదానంలో గార్ల, బయ్యారం పోలీస్, ప్రెస్‌క్లబ్‌లస్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం జరిగాయి. తొమ్మిది ఓవర్లలో పోలీస్‌క్లబ్ 86 పరుగులు సాధించింది. బయ్యారం ప్రెస్‌క్లబ్ ఇంకో రెండు బంతులుండగానే లక్ష్యాన్ని ఛేదించి గెలుపొందింది. పోలీస్‌జట్టు ద్వితీయ స్థానం సాధించింది. విజేతలను గార్ల, బయ్యారం సీఐ రవికుమార్ అభినందించారు. ఎస్సైలు జీనత్‌కుమార్, తిరుపతి, గార్ల, బయ్యారం ప్రెస్‌క్లబ్ సభ్యులున్నారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి

నెహ్రూసెంటర్: రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని మహబూబాబాద్ పట్టణ సీఐ పి.దేవేందర్ అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వేడుకల్లో ఘర్షణలకు తావు ఉండకూడదన్నారు.

అవార్డులతో బాధ్యతలు రెట్టింపు

డోర్నకల్: అవార్డులతో బాధ్యతలు రెట్టింపు అవుతాయని ఖమ్మం జిల్లా పద్మశాలి ఉద్యోగుల విభాగం బాధ్యులు పేర్కొన్నారు. డోర్నకల్ మండలం చిల్కోడు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు డి పద్మ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన సందర్భంగా ఖమ్మంలో పద్మ దంపతులను ఆదివారం సత్కరించారు. సంఘం నేతలు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

స్నేహానికి గుర్తుగా..

కొత్తగూడ, న్యూస్‌టుడే: కార్లాయికి చెందిన పొడుగు ప్రేమ్‌సాగర్ ఇటీవల గుండెపోటుకు గురై మృతిచెందాడు. అతడి స్నేహితులు తమ చిన్ననాటి స్నేహితుడి జ్ఞాపికను ప్రత్యేకంగా తయారు చేయించారు. ఆదివారం ప్రేమ్‌సాగర్ ఖర్మ కార్యక్రమానికి హాజరై తమ మిత్రుడి చిత్రాన్ని తల్లిదండ్రులు నర్సయ్య, మల్లికాంబలకు అందజేశారు. వచ్చినవారికి జ్ఞాపకార్థం ప్లేట్లను పంపిణీ చేశారు.

పెన్సిల్ లిడ్‌పై ఎమ్మెల్యే పేరు

కేసముద్రం: కేసముద్రం మండలం అమీనాపురం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు లింగాల నిఖిల్ పెన్సిల్ లిడ్‌పై ఎమ్మెల్యే మురళీనాయక్ పేరు చెక్కి తన అభిమానాన్ని చాటుకున్నారు. తాను 3గంటలు శ్రమించి చెక్కిన కళాఖండాన్ని ఆదివారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు పుట్టినరోజు సందర్భంగా ఇచ్చారు.

అకాల వర్షంతో తడిసిన మొక్కజొన్న

కేసముద్రం: మండలంలో ఆదివారం కురిసిన అకాల వర్షానికి కేసముద్రం వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు ఆరబోసుకున్న మొక్కజొన్న తడిసి ముద్దయింది. వానాకాలం సాగు చేసిన మొక్కజొన్న పంట ప్రస్తుతం కోత దశలో ఉంది. వ్యవసాయ బావుల వద్ద సౌకర్యం లేకపోవడంతో రైతులు మార్కెట్ యార్డులో ఆరబోశారు. సాయంత్రం కురిసిన వర్షానికి తడిసింది. పంటను కాపాడేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఉత్తరతండాలో అక్రమంగా నిల్వ ఉంచిన 6 క్వింటాల ప్రజాపంపిణీ బియ్యం పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపారు. వాంకుడోత్ కిషన్ ఇంట్లో తనిఖీ చేసి బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. సతీష్ అనే వ్యాపారి తండాలో కొనుగోలు చేసి కిషన్ ఇంట్లో నిల్వ ఉంచినట్లు ఆమె తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ



అనుమానితుడు

దంతాలపల్లి న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన దంతాలపల్లిలో చోటు చేసుకుంది. ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. వేములపల్లి గ్రామానికి చెందిన రైతు గుమ్మడవెల్లి సాలయ్య వ్యవసాయంతో పాటు మోటార్ మెకానిక్‌గా పని చేస్తున్నారు. బ్యాంకు పని మీద శనివారం దంతాలపల్లిలోని యూనియన్ బ్యాంక్‌కు వచ్చారు. బ్యాంక్ ఎదుట ఉన్న చెట్టు కింద ద్విచక్రవాహనాన్ని నిలిపి బ్యాంకులోకి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకిందన్న ద్విచక్ర వాహనాల వద్దకు వచ్చి మొదట ఓ బైక్‌ను అపహరించేందుకు ప్రయత్నించగా అది స్టార్ట్ కాలేదు. దాని పక్కనే ఉన్న సాలయ్యకు చెందిన ద్విచక్ర వాహనాన్ని స్టార్టు చేసి తొర్రూరు వైపు వెళ్లారు. బ్యాంకు పని ముగించుకుని వచ్చి చూడగా ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో అన్ని చోట్లా వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని అపహరించుకుని పోతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాజు తెలిపారు.

బుస్సుమంది..



కొత్తగూడ: ఎదుళ్లపల్లికి చెందిన ఎల్ది వీరన్నకు చెందిన ద్విచక్రవాహనంలోకి పాము దూరి అతడు బయటకు వెళ్లేందుకు బైక్ తీయగానే బుస్సుమంది. దీంతో అతడు ఆందోళన చెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. ఉదయాన్నే వీరన్న ద్విచక్రవాహనానికి తీయగానే ద్విచక్రవాహనం సీటు కిందిభాగం పాము కనిపించింది. ఆందోళన చెందిన వీరన్న స్థానికుల సాయంతో దానిని చంపి బయటకు తీశారు.

ఇంటిపై పిడుగుపాటు

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని బలరాంతండాలో ఆదివారం మధ్యాహ్నం గుగులోతు రమేష్ ఇంటిపై పిడుగుపడింది. ఇంట్లో అతడి తల్లి గుగులోతు లక్ష్మి ఉన్నారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో భయాందోళనకు గురై ఆమె పక్కింటికి పరుగు తీశారు. ఇంటి గోడల పెచ్చులు ఊడిపడ్డాయి. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని స్థానికులు తెలిపారు.

కల్వలో గేదె మృతి

కేసముద్రం, న్యూస్‌టుడే: పిడుగుపాటుతో పాడి గేదె మృతి చెందిన సంఘటన ఆదివారం కల్వల గ్రామంలో జరిగింది. క్యాంపుతండాకు చెందిన ధరంసోతు రాంచంద్రు భూమి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. ఆదివారం వ్యవసాయ బావి వద్ద రెండు గేదెలు, ఎద్దులు కట్టేసి సమీపంలోని పొలంలో పచ్చిగడ్డి కోస్తున్నారు. పశువులకు సమీపంలో రాంచంద్రు భార్య కౌసల్య ఉన్నారు. చెట్టుపై పిడుగు పడటంతో పాడి గేదె మృతి చెందింది. చెట్టు సమీపంలో ఉన్న కౌసల్య కూడా కింద పడిపోయారు. రాంచంద్రు పరుగును చేరుకొని భార్యకు సపర్యలు చేయడంతో తేరుకున్నారు..

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

చిన్నగూడూరు, న్యూస్‌టుడే: కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలైన ఘటన గుండంరాజుపల్లిలో చోటు చేసుకుంది. ఉదయం పూట ఇంటి అవరణలో ఉన్న వృద్ధురాలు అసుద వెంకటమ్మపై కోతులు దాడి చేయడంతో గాయాలయ్యాయి. స్థానికులు కాపాడి బాధితురాలికి ప్రథమ చికిత్స చేయించి జిల్లా ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కోతుల సమస్యను నివారించాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎల్లంపేట ఉన్నత పాఠశాలలో 1989-90 పదోతరగతి విద్యార్థులు

మరిపెడ, న్యూస్‌టుడే: మరిపెడ మండలం ఎల్లంపేట ఉన్నత పాఠశాలలో 1989-90 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్వ విద్యార్థులు 34 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. అప్పటి గురువులను సన్మానించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమైన పాఠశాల సామగ్రి తిరిగి పునరుద్ధరించేందుకు పూర్వ విద్యార్థులు పలువురు విరాళాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

తొర్రూరులో..



తొర్రూరు, న్యూస్‌టుడే: పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి సందడి చేశారు. డివిజన్ కేంద్రంలోని సమత డిగ్రీ కళాశాలలో 2001-04 లో డిగ్రీ పూర్తి చేసిన వారు ఆదివారం కళాశాలలో సమ్మేళనం నిర్వహించారు. అలనాటి గురువులను సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.